# నగరానికి ట్రాఫికర్

- లోపించిన క్షేత్రస్థాయి పర్యవేక్షణ
- రోడ్లపైకి రాకుండా పోస్టింగ్‌ల కోసం పరుగులు
- భారీగా స్తంభిస్తున్న ట్రాఫిక్.. ఇబ్బందుల్లో వాహనదారులు



సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ట్రాఫిక్‌లో నగర పౌరులు నరకం చూస్తున్నారు. అరగంట ప్రయాణానికి గంటకుపైగా సమయం పడుతుందంటూ వాపోతున్నారు. ప్రభుత్వం మారడం, అధికారులు మారడంతో ట్రాఫిక్ విభాగంలో పనిచేసే వారంతా ఇక్కడ ఉంటామా? వెళ్లిపోతామా? వేరే పోస్టు ఎందుకు చూసుకోవద్దని ఎవరి ప్రయత్నాలలో వారుండడంతో క్షేత్ర స్థాయిలో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కుంటుపడింది. అసలే ట్రాఫిక్‌లో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగర పౌరులకు వీఐపీ మూమెంట్ కూడా పెరగడంతో తీవ్రతను మరింతగా పెంచుతున్నది. నగరంలో ట్రాఫిక్‌పై నిరంతర పర్యవేక్షణ ఉండాలి, అలాంటప్పుడే వాహనాల మూమెంట్ నిరంతరం సాఫీగా వెళ్తుంది. ఏ ఒక్క చోట నిర్లక్ష్యం వహించినా దాని ప్రభావం ఆ చుట్టు పక్కల ప్రాంతాలపై పడుతుంది. అధికార యంత్రాంగం మార్పుతో ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి అధికారుల వరకు ట్రాఫిక్ విభాగాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో రోజు రోజుకు సమస్య జటిలమవుతున్నది.

## విధులను వదిలేసి.. పోస్టింగ్‌ల కోసం పైరవీలు

ఉన్నతాధికారులకు కొత్తగా పోస్టింగ్‌లు వచ్చినా కిందిస్థాయి అధికారులలో కూడా స్థాన చలనం ఉంటుందనే బావన ఉండడంతో వాళ్లు కూడా క్షేత్ర స్థాయిలో చేతులెత్తేస్తున్నారు. ఒక ఠాణా పరిధిలో ఎస్‌హెచ్‌ఓ స్థాయి అధికారి పట్టించుకోలేదంటే కిందిస్థాయి అధికారులు నామ మాత్రంగా విధులు నిర్వహిస్తుంటారు. కొందరు ఎస్‌హెచ్‌ఓలు, ఏసీపీ స్థాయి అధికారులు తమ పోస్టింగ్‌ల కోసం తమకు తెలిసిన వారి వద్ద నుంచి పైరవీలు చేయించడంపై దృష్టి పెట్టారు. గ్రేటర్‌లో 380 జంక్షన్లుండగా అందులో 85 చోట్ల అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థ ఐటీఎంఎస్ కొనసాగుతున్నది. ఈ టెక్నాలజీతో వాహనాల సంఖ్యను బట్టి స్నిగల్ వ్యవస్థ ఆటోమెటిక్‌గా పనిచేసే సిస్టమ్‌ను అమలు చేస్తున్నారు. మూడు కమిషనరేట్లకు ఎక్కడికక్కడే ట్రాఫిక్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లున్నాయి. ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్‌ను బంజారాహిల్స్‌కు మార్చారు. అది పూర్తిస్థాయిలో మార్చకపోవడంతో పర్యవేక్షణ లోపం కూడా కన్పిస్తుందనే విమర్శలు వస్తున్నాయి.

## ఎలాగు బదిలీలుంటాయని..

కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టడంతో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిపోయే వారి సంఖ్య పెరుగుతుందని, దీంతోనే నగరంపై ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని కిందిస్థాయిలో పనిచేసే సిబ్బంది పేర్కొంటున్నారు. ఇదంతా తప్పించుకునేందుకేనంటూ నగర పౌరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 30వ తేదీ వరకు నగరంలో ట్రాఫిక్ జామ్ ఎక్కడ కన్పించలేదు. ఎప్పుడైతే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో ట్రాఫిక్‌లో పనిచేసే సిబ్బంది బయటకు వెళ్లాలనే ఆలోచనలో కొందరు, ఎలాగు బదిలీలుంటాయని మరికొందరు తమ విధులను మర్చిపోయారు. దీనికి తోడు కమిషనర్‌తో పాటు ట్రాఫిక్ అదనపు సీపీ, ట్రాఫిక్ డీసీపీలు కూడా మారడంతో ఈ విభాగాన్ని పట్టించుకునే వారు లేకుండా పోయారు. అందరూ అదే ఆలోచనలతో ఉండడంతో రోడ్లపై ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించే వారు కరువయ్యారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువవుతుందంటే ఎప్పకటిప్పుడు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ మార్పులు చేర్పులు చేస్తూ ఎక్కడ కూడా వాహనాలు ఆగకుండా గతంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతోనే నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టారు. 2014లో 40 లక్షల వాహనాలుండగా, 2023 నవంబర్ నాటికి 90 లక్షల వరకు పెరిగాయి. అయినా కూడా ట్రాఫిక్ రద్దీ లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో ట్రాఫిక్ సాఫీగా సాగింది. దాంతో పాటు 2014లో ఉండే వాహనాల స్పీడ్ గంటకు 20 కిలోమీటర్ల వరకు ఉండగా 2022 నాటికి 27 కిలోమీటర్ల వరకు పెరిగింది.

## హోంగార్డు నుంచి పైస్థాయి వరకు అప్రమత్తంగా ఉండాలి

ట్రాఫిక్‌పై నిరంతరం ఫోకస్ ఉండాలి. ముందుచూపుతో వెళ్లాలి. హోంగార్డు నుంచి పైస్థాయిలో ఉండే అధికారుల వరకు ట్రాఫిక్ విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ముందు చూపుతో వెళ్లాలి. నేడు నగరంలో వాహనం నడపడం పద్మవ్యూహంలా మారింది. మొన్నటి వారు రయ్యూమంటూ వెళ్లే వాహనదారుడు నేడు ట్రాఫిక్‌లో చిక్కుకొని విల విలలాడుతున్నాడు. సికింద్రాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్, బేగంపేట్, జుబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్, లక్డీకాపూల్, అబిడ్స్, నాంపల్లి, చాదర్‌ఘాట్, హబ్సిగూడ, ఉప్పల్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, సుచిత్రా, కొంపల్లి, కూకట్‌పల్లి, మియాపూర్ తదితర ప్రాంతాలలో ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ట్రాఫిక్ జామ్‌లలో వాహనదారులు చిక్కుకుపోతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వారికి, ఉన్నతాధికారులకు, కమాండ్ కంట్రోల్స్ నుంచి ట్రాఫిక్‌ను పర్యవేక్షించే వారి మధ్య సమన్వయం ఉండాలి. అలాంటప్పుడు సమస్యలు ఎప్పకటిప్పుడు పరిష్కారమవుతాయి. ఈ విషయాన్ని విస్మరిస్తే నగర పౌరులకు భవిష్యత్తులో ట్రాఫిక్ కష్టాలు తప్పవు. ట్రై పోలీస్ కమిషనర్‌లు ఈ విషయంపై ఫోకస్ పెట్టి ట్రాఫిక్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.



# రాష్ట్రపతి నిలయంలో జెండా ప్రతిరూపం

- ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

బొల్లారం, డిసెంబర్ 21 : బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసే జెండా ప్రతిరూపాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఆవిష్కరించారు. అదేవిధంగా శివుడు, నంది ఎద్దుల శిల్పాల విగ్రహాలను ఆవిష్కరించారు. హైదారాబాద్ చరిత్రను వర్ణించే నాలెడ్జ్ గ్యాలరీ ఎన్‌క్లేవ్‌ను ప్రారంభించారు. మేజ్ గార్డెన్, చిల్డ్రన్ పార్క్, మూడు మెట్ల బావులను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, మంత్రి సీతక్క, అధికారులు పాల్గొన్నారు.



జెండా ప్రతిరూపాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## నేడు ఎట్ హోం కార్యక్రమం.. ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం రాష్ట్రపతి ఏర్పాటు చేస్తున్న ఎట్ హోం కార్యక్రమం నేపథ్యంలో మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు తెలిపారు. ఇందులో భాగంగా లోతుకుంట టీ జంక్షన్, ఎంసీఈఎంఈ సిగ్నల్, లాల్ బజార్ టీ జంక్షన్, తిరుమలగిరి ఎక్స్ రోడ్స్, సికింద్రాబాద్ క్లబ్, తివోలి ఎక్స్ రోడ్స్, ప్లాజా ఎక్స్ రోడ్స్, సీటీఓ, ఎస్‌బీఐ జంక్షన్, రసూల్‌పురా, పీఎన్‌టీ ఫ్లై ఓవర్, గ్రీన్ ల్యాండ్స్, మొన్నప్ప జంక్షన్, ఎంఎంటీఎస్, వీవీ విగ్రహం జంక్షన్, ఖైరతాబాద్, పంజాగుట్ట, ఎన్ఎఫ్‌సీఎల్, ఎన్టీఆర్ భవన్, జుబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్లను మూసివేయడం లేదా ట్రాఫిక్ మళ్లించనున్నట్లు సూచించారు. ఈ రూట్లలో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లి ట్రాఫిక్ ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు.

# నగరంలో 10కి చేరిన కరోనా కేసులు

**గురువారం ఒక్కరోజే 4 కేసులు నమోదు.. అందుబాటులోకి ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టులు**

సిటీబ్యూరో, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : నగరంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య గడిచిన రెండు రోజుల్లో 10కి చేరింది. ఈ నెల 20న 6 కేసులు నమోదు కాగా, తాజాగా గురువారం మరో 4 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కేసులు పెరుగుతున్న దృష్ట్యా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. నగర పరిధిలోని అన్ని యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా దవాఖానలతోపాటు ఉస్మానియా, గాంధీ, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, ఎర్రగడ్డ చాతి దవాఖాన వంటి టీచింగ్ హాస్పిటళ్లలోనూ కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు. గాంధీ, కోరంటి, ఎర్రగడ్డ చాతి దవాఖాన, కింగ్‌కోఠి జిల్లా దవాఖానతోపాటు కొండాపూర్, వనస్థలిపురం, మల్కాజిగిరి దవాఖానల్లో ఆర్టీపీసీఆర్ పరీక్షలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. అన్ని బస్తీ దవాఖానలు, ఇతర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనూ ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కరోనా లక్షణాలున్నట్లు అనుమానం ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# 2 బీహెచ్‌కే ఇండ్లకు మౌలిక వసతులు

## పనులకు టెండర్లు ఆహ్వానించిన జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న బలమైన సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన రెండు పడక గదుల ప్రాజెక్టులో భాగంగా దాదాపు 60వేల మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేసింది. 111 లోకేషన్లలో లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పంపిణీలో శాసన సభ ఎన్నికల కోడ్ సమయానికి అత్యంత పారదర్శకంగా కేసీఆర్ ప్రభుత్వం పేదలకు ఇండ్ల పంపిణీ చేసింది. పంపిణీ చేసిన 2బీహెచ్‌కే ఇండ్ల సముదాయంలో జీహెచ్ఎంసీ మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. అత్యాధునిక సౌకర్యాలతో సిద్ధం చేసి ప్రజలకు అందించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో లిఫ్టుల నిర్వహణ, వీధి లైట్ల ఏర్పాటు, మెరుగైన రహదారులు, ఇతర పనులకుగానూ జీహెచ్ఎంసీ టెండర్లను ఆహ్వానించింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సకల సదుపాయాలను సమకూర్చుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ అనుమతితో మౌలిక సదుపాయాల కల్పన, మిగిలిపోయిన ఇండ్లను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాలపై జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.